క్లుప్తంగా

ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో వివిధ వృత్తి విద్య కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామని ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతులకు ఫ్యాషన్ డిజైనింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. 5వ తరగతి ఆపైన విద్యార్హత గల గ్రామీణ ప్రాంత యువతులకు ఈ నెల 27 నుంచి శిక్షణ కార్యక్రమం ప్రాంభించనున్నట్టు తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల యువతులకు శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతులు 95027 23561, 99485 65256 నెంబర్లో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న వారు శిక్షణకు వచ్చే సమయంలో ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు మూడు కలర్ పాస్‌పోర్టు ఫొటోలు తీసుకు రావాలని సూచించారు.

ఏఆర్ సిబ్బంది పనితీరు ప్రశంసనీయం



ఏఆర్, స్పెషల్ పోలీస్ సిబ్బందికి ఆహార పదార్థాలు వడ్డిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) పోలీసులు, స్పెషల్ పోలీస్ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు. శుక్రవారం ఏఆర్, స్పెషల్ పోలీస్‌లతో ఆమె ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా విధి నిర్వహణ చేసిన ఏఆర్, స్పెషల్ పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో వచ్చే జూన్ 4వ తేదీన నిర్వహించే కౌంటింగ్ బందోబస్తు విధుల్లో సైతం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని సూచించారు. ఆయా విభాగాల సిబ్బందికి ఆమె విందు ఏర్పాటు చేసి, వారికి స్వయంగా ఆహార పదార్థాలు ఆత్మీయంగా వడ్డించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్, ఆర్ ఎస్సైలు నరేంద్ర, భాస్కర రావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ

ఏలూరు(మెట్రో): దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్య వేణి శుక్రవారం తనిఖీ చేశారు. ఏలూరులోని సర్ సీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను ఆమె సందర్శించారు. ఈవీఎంల తలుపులకు వేసిన తాళాలను, వాటికున్న సీళ్లను, సీసీ కెమెరాలు పరిశీలించారు. అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో లావణ్యవేణి సంతకం చేశారు. ఈవీఎం కంట్రోల్ రూంను పరిశీలించారు.

సాల్వేషన్ ఆర్మీ నూతన చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

దెందులూరు: దెందులూరులో 125 ఏళ్ల ఆధ్యాత్మిక విశిష్ట సేవలు అందించిన సాల్వేషన్ ఆర్మీ చర్చి స్థలంలో నూతన చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని సాల్వేషన్ ఆర్మీ కల్నల్ యాకుబ్ మసీ, సుమిత్రా మసీ అన్నారు. శుక్రవారం డివిజనల్ కమాండర్ జే.మోషే, దెందులూరు సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ కె.రమణయ్య, లెఫ్టినెంట్ కల్నల్ జోషియా, సంఘస్తులు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించే చర్చికి శంకుస్థాపన చేశారు. తొలుత కల్నల్ యాకుబ్ మసీ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి కావాలని, మరింత దేవుని ఆధ్యాత్మిక సేవ విస్తృత పరిచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సమష్టి కృషి, నిరంతర ప్రార్థన, సంకల్ప బలంతో సాధించలేనిది ఏమీ ఉండదన్నారు. దెందులూరు కోర్ ఆఫీసర్ రమణయ్య, లెఫ్టినెంట్ కల్నల్ జోషియా, సంఘస్తులు, దాతల శ్రమను, సేవలను కల్నల్ దంపతులు ప్రత్యేకంగా కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా దెందులూరు విచ్చేసిన కల్నల్ దంపతులకు దెందులూరు కోర్ సంఘస్తులు అపూర్వ స్వాగతం పలికారు. దెందులూరు బస్టాండ్ సెంటర్ నుంచి ప్రత్యేక వాహనంపై మేళతాళాలతో పూలు చల్లుతూ ఊరేగింపుగా క్రైస్తవ గీతాలాపానలతో శంకుస్థాపన స్థలానికి తీసుకువెళ్లారు. అనంతరం కల్నల్ దంపతులను లెఫ్టినెంట్ కల్నల్ జోషియా, సంఘస్తులు ఘనంగా సత్కరించారు.

సిరుల పాడి.. విజ్ఞాన బడి

- పాడి రైతుల అభివృద్ధే లక్ష్యం
- రైతు భరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడి
- గిరిజన మండలాల్లో 64 కేంద్రాల్లోనూ అమలు
- పశుపోషణ, మెలకువలపై అవగాహన



దొరమామిడిలో రైతులకు అవగాహన కలిగిస్తున్న దృశ్యం



దర్భగూడెం ఆర్‌బీకేలో రైతులకు సలహాలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: అన్నదాతల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్న ప్రభుత్వం పాడి రైతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించింది. రైతుల ముంగిట సేవలు అందించేలా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి భూమి తల్లి పుత్రులకు, వ్యవసాయానికి అవసరమైన అన్ని రకాల సేవలు అందిస్తోంది. ఆర్బీకేల్లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. పాడి రైతుల సంక్షేమానికి రైతు భరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడి అనే కార్యక్రమాల్ని ప్రభుత్వం ఏర్పాటు చేసి తద్వారా పశుపోషణ, మెలకువలపై పాడి రైతుకు అవగాహన కలిగించేలా కృషి చేస్తోంది. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడి కార్యక్రమం అమలు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ప్రతి కేంద్రంలో పాడి రైతులకు సలహాలు, సూచనలు కూడా అందిస్తున్నారు.

గిరిజన మండలాల్లోని 64 కేంద్రాల్లో అమలు

బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో మొత్తం 64 రైతు భరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడి కార్యక్రమం అమలవుతోంది. ప్రతి సచివాలయం పరిధిలో 64 మంది పశు వైద్య సహాయకులు, నలుగురు గోపాలమిత్రలు పాడి రైతులకు సలహాలు, సూచనలు కలిగించేలా కృషి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మంగళవారం 54 చొప్పున విజ్ఞాన బడులు నిర్వహిస్తామన్నారు. ఈ బడులను సుమారు వెయ్యి మందికి పైగా పాడి రైతులు వినియోగించుకుంటున్నారు.

పెంపకంపై అవగాహన

పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో పాడి రైతులకు పాడి పెంపకం, యాజమాన్య పద్ధతులు, ఏడాదికి ఒక దూడ కార్యక్రమం, పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కలిగించేలా కృషి చేస్తున్నారు. పశువుల్లో వచ్చే వ్యాధులైన గొంతువాపు, జబ్బవాపు, సంచుల వ్యాధి, మేకలు, గొర్రెలకు వచ్చే చీకటి వ్యాధి, జీవాలకు టీకాలు వేసే సమయం తదితర అన్ని వివరాలను పశువైద్య సహాయకులు విజ్ఞాన బడుల్లో పాడి రైతులకు వివరిస్తారు. అలాగే దగ్గరుండి టీకాలు వేయిస్తారు. పశువుల కృత్రిమ గర్భధారణ గురించి వివరిస్తున్నారు.

అన్ని కేంద్రాల్లోనూ పశు విజ్ఞాన బడి



జిల్లాలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడి కార్యక్రమం అమలు చేస్తున్నాం. పశువుల పెంపకంలో మెలకువలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. సుమారు వెయ్యికి పైగా పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. – మల్లంపల్లి సాయిబుచ్చారావు, సహాయ సంచాలకులు ప్రాంతీయ పశువర్ధకశాఖ, జీలుగుమిల్లి

పాడి పెంపకంపై అవగాహన



జిల్లాలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడి కార్యక్రమం అమలవుతోంది. రైతులకు పాడి పెంపకం, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ పశువిజ్ఞాన బడును సుమారు వెయ్యి మందికి పైగా పాడి రైతులు వినియోగించుకుంటున్నారు.
– తెల్లం భీమరాజు, రైతు, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

పశు విజ్ఞాన బడులతో మేలు



పశు విజ్ఞాన బడుల్లో అందిస్తున్న సేవలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ బడుల్లో పాడి రైతులకు పశువులకు, మేకలకు, గొర్రెలకు వచ్చే వ్యాధుల నివారణపై చేపడుతున్న అవగాహన కార్యక్రమం చాలా కలిగించేలా ఉంది.
– తెల్లం దేవరాజు, రైతు కంసాలికుంట, బుట్టాయగూడెం మండలం

హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం



పంగిడిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఈఓ మల్లిక

ద్వారకాతిరుమల: బాలికలు తమ హక్కులు, చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ఈఓ మల్లిక అన్నారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మాసికా మాసోత్సవ కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రుతుక్రమం – అపోహలు, నిషేధాలు, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రుతుక్రమ సమయంలో వాడే ఉత్పత్తులు, వాటిని పడవేసే పద్ధతిని వివరించారు. కార్యక్రమంలో డీసీపీయూ సోషల్ వర్కర్‌లు పి.రాజేష్, రాజ్‌కుమార్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ వైవీ రాజు, జంగారెడ్డిగూడెం సీడీపీఓ బ్యూలా, ఏసీడీపీఓ రాజశ్రీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు టి.మేరి, లక్ష్మీరాజ్యం, కె.మణి, జీఎంఎస్‌కే, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నసమారాధన

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని నూతనగూడెం రామాలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ నవమి ఉత్సవాలు అనంతరం రామాలయం వద్ద అన్నసమారాధన నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

4న ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవిచంద్ర



పాల్గొన్న రాజకీయ పక్షాల నాయకులు

జంగారెడ్డిగూడెం: జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నిర్వహించే నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని డీఎస్పీ రవిచంద్ర కోరారు. జంగారెడ్డిగూడెం సబ్‌డివిజన్‌లోని చింతలపూడి నియోజకవర్గ అన్ని పార్టీల నాయకులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక పోలింగ్‌కు సహకరించిన నాయకులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జూన్ 4న ఫలితాలు వెలువడుతున్న సందర్భంగా ఎలక్షన్ కమిషన్ సూచనలు మేరకు ఏ గ్రామంలోనూ బాణసంచా అమ్మడం, కాల్చడం, ఊరేగింపులు, అల్లర్లు చేయరాదని అన్నారు. ప్రజా జీవనానికి విఘాతం కలిగించేలా ఎవరు ప్రవర్తించిన చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫలితాలు వెలువడిన అనంతరం కవ్వింపు చర్యలు, ఎదుటి వ్యక్తిని కించపరిచే తదితర చర్యల ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలిగించ వద్దని, నాయకులందరూ సమన్వయంతో వ్యవహరించి డివిజన్‌లో ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ పి.రాజేష్, ఎస్సై జ్యోతిబాస్, వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఇండిపెండెంట్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో కార్డెన్ సెర్చ్



జంగారెడ్డిగూడెంలో సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో శుక్రవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు సీఐ పి.రాజేష్ ఆధ్వర్యంలో పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ కాలనీలో నిర్వహించిన ఈ తనిఖీల్లో పత్రాలు లేని 12 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ రాజేష్ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల లెక్కింపు ఉన్నందున శాంతి భద్రతల దృష్ట్యా తనిఖీలు చేస్తున్నట్టు చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలసౌ స్థానికులను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ప్రతి గృహాన్నీ పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం, లక్కవరం ఎస్సైలు జ్యోతిబాస్, సుధీర్‌బాబు, జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

రజత వస్త్రానికి వెండి సమర్పణ



వెండిని ఆలయ కమిటీకి అందిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి ఏకాదశ హారతి, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు అర్చకులు మనోజ్ శర్మ నిర్వహించారు. అమ్మవారి రజత వస్త్రం తయారీకి బంగారు శ్రీనివాసరావు, వెంకటలక్ష్మి దంపతులు 6 తులాలు, పోలుపర్తి సత్తిబాబు, సుజాత దంపతులు 6 తులాల వెండి, అమ్మవారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన శ్రీదరాల మణికంఠ వెంకట బంగారయ్య, ఉషా రాణి దంపతులు రూ.10,116 విరాళంగా సమర్పించారని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబికా సేవా బృందం తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ వెంకటేశ్వరస్వామి



వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

కామవరపుకోట: మండలంలో గుంటుపల్లి గ్రామ పంచాయతీ సమీపంలో మహా నాగపర్వతంపై స్వయంభుగా వెలసిన శ్రీ పద్మావతి అమ్మవారు అలివేలు మంగతాయారు సమేత శ్రీ వెంకట లక్ష్మీ నారాయణ స్వామి వారి కల్యాణం గురువారం రాత్రి కనులు పండువగా నిర్వహించారు. కళ్యాణ కార్యక్రమాన్ని ఆలయ పూజారి పామర్తి వెంకన్న బాబు ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ హయగ్రీవ పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం దుర్గబాబు, శేషాచార్యులు ఆధ్వర్యంలో పున్నమి వెన్నెల్లో వేదమంత్రాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తుల సహకారంతో ఆలయ ప్రాంగణ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని వీక్షించి కళ్యాణాక్షితలు స్వీకరించారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. శుక్రవారం స్థానిక రామచంద్ర రావుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉద్యోగులు ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ ప్రజలకు ఈ చలివేంద్ర ద్వారా మజ్జిగ పంపిణీ చేస్తోన్న ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. బాటసారులు ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవడానికి మజ్జిగ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుంచి రోజుకి 150 లీటర్ల పైగా మజ్జిగ ప్రజలకు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు సర్కిల్ విద్యుత్ ఈఈ ఎం ఝాన్సీ, ఆపరేషన్ ఈఈ జేపీబీ నటరాజన్, ఎస్ బలుసుబాబు, ఎం రమేష్, పి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం



రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన దృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టే సేవలను మరింత విస్తృత చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనంలో ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉచిత వైద్యశిబిరాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అగ్నిప్రమాదాల్లో ఇళ్లు పోగొట్టుకున్న బాధితులకు ఆయా ప్రాంతాల తహసీల్దార్ సిఫార్సుతో వంటపాత్రలు, హైజీన్‌కిట్లు, దుప్పట్లు, టార్పాలిన్‌లు పంపిణీ చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ వె.ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలోని ముఖ్యపట్టణాల్లో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, అవసరమైన వృద్ధాశ్రమాలకు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక వైద్య కేంద్రాలకు వీల్ చైర్లను పంపిణీ చేయనున్నామని తెలిపారు. సమావేశంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారామ్, డాక్టర్ జి.స్పందన, కోశాధికారి రేవూరి శివప్రసాద్, కమిటీ సభ్యులు టి.రామారావు, బీఆర్‌సీహెచ్ నారాయణ, పాలడుగు వెంకటేశ్వరరావు, బుజ్జి, కేవీ రమణ తదితరులు ఉన్నారు. ఏలూరు ఆర్‌ఆర్‌పేటలోని సౌత్ ఇండియన్ షాపింగ్ మాల్ వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. తలసేమియా బాధిత చిన్నారుల కోసం సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ యజమాన్యం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారని, వీరిలో 50 మంది సిబ్బంది రక్తదానం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా షాపింగ్‌మాల్ మేనేజర్లు హరీష్, నాగిరెడ్డి తదితరులను అభినందించారు.

వైభవంగా పుష్పోత్సవం

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు కనుల వేడుకగా సాగుతున్నాయి. దేవదాయధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్యాణోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం, కోవెల ప్రదక్షిణలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి వార్లను విశేషంగా అలంకరించి ముస్తాబు చేసారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సుందరంగా ముస్తాబైన ఓ పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు, మోహనకృష్ణాచార్యులు, సుధీరాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పవళింపు సేవ నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు స్వామి వారి వెంట కోవెల ప్రదక్షిణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి

పెదపాడు: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాఠశాలలకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను అందిస్తున్న నేపథ్యంలో వాటిని సక్రమంగా పాఠశాలలకు చేర్పించాలని సూచించారు. ఎన్నికల కోడు అమలు ఉన్నందున ఎలాంటి తీర్మానాలు చేయడం వీలుకాదన్నారు. అధికారులు ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పనప్రసాద్ పెదపాడు మండల ఉపాధ్యక్షురాలు అప్పన పద్మావతి, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యన్నారాయణ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్, ఎంపీటీసీ అక్కినేని గోపి చంద్ర దుర్గాప్రసాద్ ఎంపీడీవో జె తేజ రతన్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారాల తొలగింపు అన్యాయం

ఏలూరు (టూటౌన్): వీధి వ్యాపారులపై ఏలూరు నగరపాలక సంస్థ అధికారులు, సీఆర్ రెడ్డి కాలేజీ యాజమాన్యం దౌర్జన్యాలు, వేధింపులను అరికట్టాలని వీధివ్యాపారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ సీఆర్‌రెడ్డి కాలేజీ గోడను ఆనుకుని, టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఫుట్‌పాత్‌కి ఆనుకొని 40 మంది వరకు వీధి వ్యాపారులు వ్యాపారం చేసుకుని జీవిస్తున్నారని చెప్పారు. వీరిపై అధికారులు, కాలేజీ యాజమాన్యం దాడులు చేసి షాపులు, తోపుడు బండ్లు తొలగించడం అన్యాయం అన్నారు. సీఆర్ రెడ్డి కాలేజీ ప్రాంతం చట్ట ప్రకారం రెడ్ జోన్ కాదని, గ్రీన్ జోన్, ఎల్లో జోన్లలో ఉందని తెలిపారు. వీధి వ్యాపారుల చట్టం ప్రకారం రెడ్ జోన్, ఎల్లో జోన్లపై ఉన్న షాపులపై మున్సిపల్ అధికారులు పోలీసు అధికారులు ఎలాంటి దౌర్జన్యాలు దాడులు చేయడానికి, తొలగించడానికి వీల్లేదని అన్నారు. షాప్‌లను తొలగించిన చోటే మరలా షాపులు పెట్టుకునేందుకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

దెందులూరు: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా దోసపాడులో మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. గ్రామస్తులు ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ రెవెన్యూ అధికారి సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలను నిలుపుదల చేశారు. దోసపాడులో 109 సర్వే నంబరులో అనుమతుల్లేకుండా మట్టి తవ్వి తరలిస్తుండగా శుక్రవారం అడ్డుకున్నామని తెలిపారు. అప్పటికే కొన్ని ట్రిప్పులు మట్టిని తరలించినట్టు గుర్తించామన్నారు. గ్రామస్తులు ఫిర్యాదు అందించిన వెంటనే ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించినట్టు పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్‌కు నివేదిక అందించామని వీఆర్వో సుబ్రహ్మణ్యం తెలిపారు.